క్లుప్తంగా

అశ్వవాహనంపై వేంకటేశ్వరుని దర్శనం



అశ్వవాహనంపై బుగ్గ వేంకటేశ్వరస్వామి

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో బుగ్గ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున శ్రీనివాసుడిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి అశ్వవాహనంపై కొలువుదీర్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుడు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

కోవెలకుంట్ల: గడివేముల మండలం కరిమద్దలకు చెందిన ఫొటోగ్రాఫర్ నాగరాజు కుడి కాలును తొలగించడంతో దివ్యాంగుడయ్యాడు. విషయం తెలుసుకున్న విక్కీ ఫౌండేషన్ అధినేత గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి(విక్కీ) రూ. 8,500 విలువ చేసే ట్రైసైకిల్ అందజేసి ఔదార్యం చాటారు. కార్యక్రమంలో మురళీ, ఉసేన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

గూటుపల్లె మాజీ సర్పంచ్ మృతి



వెంకటస్వామి (ఫైల్)

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటస్వామి(75) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఆయన మృతిపై వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు, సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి తెలిపారు.

చేగువేరా జయంతి



నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

బేతంచెర్ల: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం చేగువేరా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, మండల కార్యదర్శి ప్రదీప్, ఎల్లకృష్ణ, మధు, రమేష్, హుస్సేన్, మధు పాల్గొన్నారు.


పాఠశాల సమయాల్లో బస్సులు నడపాలి



డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

డోన్ టౌన్: విద్యార్థులకు అనుకూలంగా స్కూళ్లు, కళాశాల సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ కోరారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ డిపోలో మేనేజర్ శశిభూషణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో స్కూళ్లు, కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోకుండా బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు కొచ్చెర్వు కాంత్, సుదర్శన్, వెంకటేష్, రవికుమార్, ప్రసాద్, జైశ్రీరామ్ వెంకటేసులు ఉన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

బేతంచెర్ల: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సేబరాణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మండల మహాసభ నిర్వహించారు. సంఘం నాయకురాలు నాగలక్ష్మి, గుల్జార్బి పాల్గొన్నారు.

విత్తన ఎంపికే కీలకం..!

- విత్తన కొనుగోలులో సరైన జాగ్రత్తలు పాటించాలి
- నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు
- పంటకాలం పూర్తయ్యే వరకు బిల్లులు భద్రం
- 24,915 హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగు లక్ష్యం



కోవెలకుంట్ల సమీపంలో ఖరీఫ్‌లో సాగైన మొక్కజొన్న

కోవెలకుంట్ల: పంటల సాగులో విత్తన ఎంపిక అత్యంత కీలకం. పంటల దశ, దిశ మార్చడంతో పాటు మంచి దిగుబడులకు దోహదపడుతుంది. సరైన విత్తన ఎంపిక జరిగితేనే చీడ పీడలను తట్టుకుని నాణ్యమైన దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. సాగులో వ్యవసాయ అధికారులతోపాటు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాల్సిన అవసరం ఉంది. విత్తన ఎంపికలో ఏదైనా పొరపాటు జరిగితే పంట సాగు మొదలుకుని దిగుబడి వరకు పెట్టిన పెట్టుబడి ఖర్చుతో పాటు రైతు కష్టం నేలపాలవుతుంది. దీంతో రైతులు ఆర్థికంగా చితికిపోయి నష్టాల ఊబిలో కూరుకుపోయే ప్రమాదముంది.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం

ఈ నెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో 24,915హెక్టార్లలో రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, మిరప, మినుము, కంది, జొన్న, పొగాకు, ఆముదం, ఉల్లి, పెసర, సోయాచిక్కుడు, తదితర పంటలు సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు.

అనుకూలంగా మారిన వర్షాలు

ఖరీఫ్ ప్రారంభానికి ముందు వర్షాలు కురవగా సీజన్ ప్రారంభం కాగానే రైతులు మొక్కజొన్న, కంది, మినుము, పత్తి, తదితర పంటలను సాగు చేశారు. విత్తనం వేశాక పదిరోజులపాటు వరుణుడు ముఖం చాటేయడంతో విత్తన ప్రక్రియకు బ్రేక్‌పడింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రెండు రోజుల నుంచి వ్యవసాయ సబ్ డివిజన్‌లో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఊరట చెందుతున్నారు. వర్షం తెరప ఇచ్చిన వెంటనే వివిధ పంటలు సాగు చేసేందుకు రైతులు విత్తనాలు, రసాయన ఎరువులను సమకూర్చుకుంటున్నారు. చాలా మంది రైతులు ఎక్కడ పడితే అక్కడ వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, సజ్జ, మినుము, వంటి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. రైతులు స్థానిక వ్యవసాయ అధికారులు సర్టిఫైడ్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. అలాగే షాపు యజమానికి లైసెన్స్ ఉందా లేదా అని తెలుసుకోవాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు కచ్చితంగా బిల్లులు అడిగి తీసుకోవాలి. తీసుకున్న విత్తన బిల్లులను పంట దిగుబడి చేతికి వచ్చే వరకు భద్రంగా దాచుకోవాలి. లేకుంటే విత్తన ఎంపికలో ఏదైనా పొరపాటు జరిగితే దిగుబడులు తగ్గి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. విత్తన ఎంపికే దిగుబడులను నిర్ణయిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

సబ్ డివిజన్‌లో పంటల సాగు వివరాలు

పంటరకం	సాగు లక్ష్యం(హెక్టార్లలో)
వరి	9513
పత్తి	2479
మొక్కజొన్న	1735
మినుము	1869
కంది	1701
మిరప	5141
జొన్న	551

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసే రైతులు కచ్చితంగా బిల్లులు అడిగి తీసుకోవాలి. పంట దిగుబడి చేతికందే వరకు రైతులు బిల్లులను భద్రంగా దాచుకోవాలి. పంటలో పూత, పిందె, దిగుబడిలో తేడా వస్తే వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

–సుధాకర్‌రెడ్డి, ఏఓ, కోవెలకుంట్ల

విత్తనాల కొనుగోలులో పాటించాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన ఆదీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాల కొనుగోలు సమయంలో డీలర్ల వద్ద తీసుకున్న బిల్లులు పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలి.
- బిల్లుపై విక్రయదారుడి పేరు, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, విత్తన రకం, గడువు తేదీ, కంపెనీపేరు, డీలర్ సంతకం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- లూజు విత్తనాలు, గడువు దాటిన విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దు.
- కొనుగోలు చేసే విత్తనాల ప్యాకెట్ల నుంచి సంచిపైన సీల్ ఉందా లేదా అని పరిశీలించాలి.
- రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విక్రయదారులు ఇచ్చే కరపత్రాలను తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలను పూర్తిగా చదివి అవగాహన చేసుకోవాలి.
- విత్తనం కొనుగోలు చేసిన వెంటనే పరీక్షించాలి. మొలకశాతం సంతృప్తిగా ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి.
- మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కన్పిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

ఆలయాభివృద్ధికి రూ.5లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్: పట్టణంలోని సాయిబాబా ఆలయ అభివృద్ధి కోసం కర్నూలుకు చెందిన ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ అధినేత ఆవుల సురేష్‌కుమార్, కృష్ణప్రియ దంపతులు రూ.5,00,009 విరాళం అందజేశారు. శనివారం డోన్‌కు వచ్చి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ధర్మారం సుబ్బారెడ్డి, కందుకూరు పార్థసారథి, మల్లికార్జునరెడ్డి, శ్రీరాములు, మహేశ్వరరెడ్డిలకు విరాళం నగదును అందజేశారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రతిభా విద్యార్థినికి చేయూత



అడ్మిషన్ ఇప్పిస్తున్న దాతలు

డోన్ టౌన్: ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించినా ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నత విద్యను అభ్యసించడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థినికి దాతలు చేయూతనిచ్చారు. మండలంలోని కొచ్చెర్వు గ్రామానికి చెందిన మండ్ల స్రవంతి మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదివి బైపీసీ గ్రూపులో 974 మార్కులు సాధించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా నీట్ లాంగ్ టర్మ్ చేసి డాక్టరు అవ్వాలన్న కోరిక ఉందన్న ఆమె లక్ష్యానికి మహర్షి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు సురేష్‌నాయుడు స్పందించారు. కొంత మంది దాతల సహాయంతో శనివారం స్రవంతికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో అడ్మిషన్ చేయించారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు



మాట్లాడుతున్న హెచ్‌ఎం షార్జానాఖానం

డోన్: రక్తదాతలు ప్రాణదాతలతో సమానం అని శ్రీసుధ పాఠశాల హెచ్‌ఎం షార్జానాఖానం అన్నారు. స్థానిక కళాశాల క్యాంపస్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పది మందికి వెలుగునిచ్చే దీపం లాంటి వారు రక్తదాతలని కొనియాడారు. ఏటా ప్రమాదాలు, రక్తహీనత వంటి కారణాలతో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతుండడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ మ్యారీ చార్లెస్, ద్రోణాచలం సేవాసమితి సభ్యులు రఫి, శివారెడ్డి, షబ్బీర్, బాబా, మనోజ్, రమణ తదితరులు పాల్గొన్నారు.





హెచ్‌కొట్టాలలో ట్రాక్టర్‌తో విత్తనాలు వేస్తున్న రైతన్న, బలపాలపల్లెలో కాడెద్దులతో విత్తనాలు వేస్తున్న రైతు

ఊపందుకున్న ఏరువాక

ఖరీఫ్ ప్రారంభం కావడంతో రైతులు కోటి ఆశలతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో సుమారు 14 వేల హెక్టార్ల వ్యవసాయ భూమి సాగులో ఉంది. దుక్కులు చేసి ఎరువులు చల్లి విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్న సమయంలో పంటల సాగుకు సరిపడే వర్షం కురవడంతో కంది, కొర్ర, వేరుశనగ, ఆముదం, ప్రొద్దుతిరుగుడు, సజ్జ, మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్నారు. ఎం.పెండేకల్లు, ముద్దవరం, బుగ్గానిపల్లె, ఆర్‌ఎస్ రంగాపురం, ఆర్ కొత్తపల్లె, నాగమల్లకుంట, కొమ్మూరి కొట్టాల, గూటుపల్లె గ్రామాల్లోని పంట పొలాల్లో వ్యవసాయ కూలీలు, కాడెఎద్దుల సందడితో ఏరువాక జోరుగా సాగుతోంది. తమ కష్టాన్ని పరీక్షించేందుకు రైతన్నలు ఖరీఫ్ సాగుకు మరొకసారి సిద్ధం అవుతున్నారు. అయితే సీజన్ ప్రారంభమై రెండు వారాలు అవుతున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు, పెట్టుబడి సాయం అందజేయలేదు.

–బేతంచెర్ల



సీసీ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్లపైనే మురుగునీటి ప్రవాహం

కొలిమిగుండ్ల: బెలుంలో పారిశుద్ధ్యం లోపించింది. నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన సీసీరోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పలు కాలనీల్లో నుంచి ప్రధాన సీసీరోడ్డుపైకి మురుగు నీరు వస్తున్నాయి. చాలా చోట్ల కాల్వలు పూడిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు మురుగునీటిలో నడిచివెళ్లే సమయంలో కింద పడిన సందర్భాలు ఉన్నాయి. బైక్‌లలో ప్రయాణించే వాళ్లు సైతం ఎక్కడ జారి కింద పడిపోతామోనని భయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని మురుగునీటి కాల్వలు శుభ్రం చేయించి రోడ్లపైకి చేరకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాగునీటి కోసం రైతన్నల ఎదురుచూపు

బనగానపల్లె: ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ ద్వారా ఆయకట్టుకు సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు. అనుసంధానంగా ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ నుంచి బ్లాక్‌లను మూసివేసి సుమారు వెయ్యి క్యూసెక్కుల నీటిని అవుకు రిజర్వాయర్‌కు మూడు రోజులుగా విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలో బనగానపల్లె, పాణ్యం, నంద్యాల మండలాల్లో 13 బ్లాక్‌లు ఉండగా 1.62లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ నెల 1 నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం.. ఆశాజనకంగా కురుస్తున్న వర్షానికి ఆయకట్టు రైతులు మొక్కజొన్న పంటను ఎక్కువగా సాగు చేశారు. నియోజకవర్గంలో 26 వేల ఎకరాల్లో సాధారణ సాగు ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఆయకట్టు రైతులు ఇప్పటికే ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నందున ఎస్సార్‌బీసీ నీటిని బ్లాక్‌ల ద్వారా విడుదల చేసి సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

వానరాలకు ఆహారం అందజేత

బేతంచెర్ల: మూగజీవాలను ప్రేమతో ఆదరించడం మానవ ధర్మం అని కోదండరామస్వామి సేవా భక్త బృందం సలహాదారు భజన కృష్ణయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాల్లో ఉన్న వానరాలకు కర్నూలు బాలాజీ సేవా ట్రస్టు సలహాదారుడు ధనుంజయరెడ్డి సహకారంతో పండ్లు ఆహారంగా అందించారు. దాతల సహకారంతో ప్రతి రోజు వానరాలకు ఆహారం అందజేస్తున్న భజన కృష్ణయ్యను పలువురు అభినందించారు. సభ్యులు నాగేశ్వర్‌రెడ్డి, జయరామిరెడ్డి, సుబ్బారెడ్డి, తిరుపం రెడ్డి పాల్గొన్నారు.

నీట్‌లో గ్రామీణ విద్యార్థి ప్రతిభ



రాహుల్

బేతంచెర్ల: నీట్ ఫలితాల్లో మండల పరిధిలోని ఎంబాయి గ్రామానికి చెందిన తలారి మద్దిలేటినాయుడు, ఉపాధ్యాయురాలు సంధ్యారాణి దంపతుల కుమారుడు బోయ రాహుల్ ప్రతిభ చాటాడు. ఇంటర్‌లో 900 మార్కులు, నీట్‌లో 720కి గాను 514 మార్కులతో 37,229 ర్యాంకు సాధించాడు. వైద్య విద్యను పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు చేయడమే తన లక్ష్యమని విద్యార్థి తెలిపాడు. కాగా రాహుల్ అక్క లాస్యప్రియాంక 2021లో నీట్‌లో ర్యాంక్ సాధించి నంద్యాల శాంతిరాం ఆస్పత్రిలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతోంది.

సీపీఐ నూతన కమిటీ ఎన్నిక

బనగానపల్లెరూరల్: పట్టణంలోని భానుముక్కల, వడ్డెపేట కాలనీల్లో సీపీఐ నూతన కమిటీ సభ్యులను ఆ పార్టీ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కార్యదర్శిగా కంబగిరిరాముడు, సహాయ కార్యదర్శిగా జయలక్ష్మయ్య, సభ్యులుగా వేముల శ్రీనివాసులు, నాగయ్య, శ్రీనివాసులు, రాముడును ఎన్నుకున్నారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

వెలుగోడు: మండలంలో పలు కేసుల్లో సీజ్ చేసిన మద్యం బాటిళ్లను శనివారం పోలీసులు ధ్వంసం చేశారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ సురేష్ కలసి మద్యం బాటిళ్లను రోడ్డు రోలర్ చేత ధ్వంసం చేయించారు. వన్ ఆర్ తూము వెనుక భద్రపరిచిన మద్యం బాటిళ్లు, మండల వ్యాప్తంగా అక్రమ మద్యం రవాణాతో పాటు సారా తయారీ కేంద్రాలపై జరిపిన దాడుల సమయంలో పట్టుబడిన నాటుసారా ప్యాకెట్లను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణా, సారా తయారీలకు సంబంధించి డయల్ 100, 112లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

వెలగని లైట్లు.. తప్పని ఇక్కట్లు



పట్టణంలో అరకొరగా వెలుగుతున్న సెంటర్ లైటింగ్

బనగానపల్లె: పట్టణంలోని పశువైద్యశాల నుంచి పెట్రోల్‌బంక్ సెంటర్ వరకు..పోలీస్‌స్టేషన్ నుంచి కొత్తబస్టాండ్ వరకు ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ (హైమాస్ట్ లైటింగ్ సిస్టమ్) బల్బులు అరకొరగా వెలుగుతున్నాయి. కొన్ని పనిచేయకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జీఎం టాకిస్ నుంచి కొత్తబస్టాండ్ వరకు సింగిల్ రోడ్డుగా ఉన్న రహదారిని రూ.8 కోట్లతో ఫోర్‌లేన్ రోడ్డుగా మార్పు చేయించారు. సెంటల్ లైటింగ్ సౌకర్యంతో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసి రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు. అయితే కొంత కాలంగా సెంటర్ లైటింగ్ బల్బుల్లో కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. నూతన బల్బులు ఏర్పాటు చేయడంలో గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై బనగానపల్లె పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా పని చేయని బల్బుల స్థానంలో నూతన బల్బులను ఏర్పాటు చేయాలంటే గ్రామ పంచాయతీలో యంత్రం లేదన్నారు. బాడుగకు తెప్పించి చేయాలంటే అవసరమైన నిధులు గ్రామ పంచాయతీలో లేవని.. అందుకే జాప్యం జరుగుతోందని తెలపడం గమనార్హం.

ద్రోణాచలం సేవాసమితికి పురస్కారం



సత్కారం అందుకుంటున్న షాదిఖానరాజు

డోన్: ద్రోణాచలం సేవాసమితి స్వచ్ఛంద సంస్థకు మరో పురస్కారం దక్కింది. శనివారం అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా కర్నూలు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు సంస్థ వ్యవస్థాపకుడు షాదిఖాన రాజుకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. డోన్‌లో ద్రోణాచలం సేవా సమితి సభ్యులు రక్తబంధు, ఆత్మబంధు, ఆహార బంధు లాంటి కార్యక్రమాలను చేపట్టి పలువురి ప్రశంసలు అందుకున్నారన్నారు. వందకుపైగా అనాథ శవాలకు అంత్యక్రియలు చేయడంతో పాటు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. అత్యవసర సమయాల్లో కర్నూలు ఆస్పత్రికి వచ్చి రక్తదానం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి సింధు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టి నాగమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, సేవాసమితి సభ్యులు శివారెడ్డి, షబ్బీర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు



రెడ్డిపల్లె గ్రామంలో ఉపాధి పనిచేస్తున్న కూలీలు

- ఉపాధి కూలీలకు రెండు నెలలుగా అందని వేతనాలు
- సంజామల మండలానికి రూ.2.73 కోట్ల బకాయి

సంజామల: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉపాధి కల్పించి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఉపాధి కూలీలు ఆకలి కేకలతో అల్లాడుతున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి ఒక్క రూపాయి వేతనం జమకాకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసిన పనులకు సుమారు 70 రోజుల నుంచి వేతనాలు అందక ఆర్థికంగా సతమతమవుతున్నారు. సంజామల మండలంలో ఏప్రిల్, మే నెలలో ఉపాధికి వెళ్లిన కూలీలకు రెండు నెలల నుంచి వేతనం జమకాకపోవడంతో కూలీల కుటుంబాల్లో సంక్షోభం నెలకొంది. మండలంలో 17 గ్రామ పంచాయతీలకు యాక్టివ్ జాబ్ కార్డులు 6169 ఉండగా 10560 మంది కూలీలు ఉపాధి హామీ పనికి వెళుతున్నారు.

పేరుకుపోయిన బకాయిలు

నిబంధనల ప్రకారం పని చేసిన వారం రోజుల్లో ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి. గరిష్ఠంగా 15 రోజుల్లోపే వేతనాలను బ్యాంకు ఖాతాల్లోకి జమచేయాలి. అయితే ప్రస్తుతం ఇవేవీ అమలు కావడం లేదు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 70 రోజులు అవుతున్నా వేతనం అందలేదు. ఏప్రిల్, మే నెలలకు 17 గ్రామ పంచాయతీలకు గాను 1.90 లక్షల పనిదినాలు చేశారు. దీనికి రూ.2.73 కోట్ల బకాయి పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలకు సకాలంలో వేతనాలు అందించాలని కూలీలు కోరుతున్నారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లలకు సుమారు 3 నెలల నుంచి వేతనాలు అందలేదు.

70 రోజుల నుంచి నగదు పడలేదు



ప్రతి రోజు 3 కిలోమీటర్లు నడిచి ఉపాధి పనికి వెళ్తున్నాను. కానీ ఖాతాలో నగదు జమకాలేదు. సుమారు 70 రోజుల నుంచి వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాను. ఇలా అయితే ఎలా బతకాలి. ఇన్ని రోజుల నుంచి నిధులు రాకుంటే ఎలా. ప్రభుత్వం స్పందించి వెంటనే నగదు జమ చేయాలి.

–లైసక్క, సంజామల

త్వరలో జమ అవుతుంది

మండలంలో 2 నెలల నుంచి ఉపాధి కూలీలకు బకాయిలు ఉండడం వాస్తవమే. ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లిన వారికి త్వరలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–జయంతి, ఏపీఓ, సంజామల





బేతంచెర్లలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, ఉద్యోగులు, అమ్మవారిశాలలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బేతంచెర్ల: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మారుతి అన్నారు. శనివారం పట్టణంలోని 5 గ్రామ సచివాలయాల పరిధిలోని ఉద్యోగులతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగాసనాలు వేశారు. ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని తెలిపారు. అనంతరం యోగా మాస్టర్ సముద్రాల మద్దిలేటి స్వామిని సత్కరించారు.